# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-11-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఏడాది పొడవునా జరిగే వేడుకలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ప్రారంభించనున్నారు.

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ కొద్ది సేపటి క్రితం ముగిసింది.

- హైడ్రో గ్రాఫిక్ సర్వే వెసెల్ "ఐఎన్ఎస్ ఇక్షక్" భారత నావికా దళంలోకి ఈరోజు ప్రవేశించింది.

- భావితరం GST సంస్కరణలు అమల్లోకి వచ్చిన తొలి రోజు నుండే ప్రతిరంగంలోనూ సానుకూల స్పందన నమోదు అయ్యిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

- భారత్ ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన నాలుగో టీ-20 క్రికెట్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది.

======================

దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన జాతీయ గేయం "వందేమాతరం" 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఏడాది పొడవునా జరిగే వేడుకలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ప్రారంభించనున్నారు. న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో ఒక స్మారక స్టాంపును, నాణేన్ని కూడా ప్రధానమంత్రి విడుదల చేస్తారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోన్న ఈ సంస్మరణోత్సవంలో 150 సంవత్సరాల వందేమాతరం చరిత్రపై ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని కూడా రేపు ప్రదర్శించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా, ప్రధాన కార్యక్రమంతో పాటూ ఉదయం 9 గంటల 50 నిమిషాల సమయంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో బహిరంగ ప్రదేశాల్లో 'వందే మాతరం' పూర్తి గేయాన్ని సామూహికంగా ఆలపిస్తారు. వందే మాతరం గేయాన్ని 1875 నవంబరు 7న బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఆయన నవల ఆనందమఠ్‌లో భాగంగా బంగదర్శన్ అనే సాహిత్య పత్రికలో వందే మాతరం

మొదటిసారిగా ప్రచురితమయ్యింది. శక్తికి, శ్రేయస్సుకు, దైవత్వానికి స్వరూపంగా మాతృభూమిని కీర్తించే ఈ గేయం అనతికాలంలోనే దేశభక్తికి శాశ్వత చిహ్నంగా నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ కొద్ది సేపటి క్రితం ముగిసింది. ఈ తొలి విడతలో సుమారు 60 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. మొదటి దశలో భాగంగా ఈరోజు 18 జిల్లాల పరిధిలో మొత్తం 121 శాసన సభ నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. ప్రశాంతమైన వాతావరణంలో ఈ ఉదయం ప్రారంభమైన పోలింగ్ రోజంతా సజావుగా సాగింది. పాట్నాలో మహాగఠ్ బంధన్ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్రమంత్రులు గిరిరాజ్ సింగ్, రాజీవ్ రంజన్ సింగ్, నిత్యానంద్ రాయ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా మొదలగు రాజకీయ ప్రముఖులు ఉదయమే తమ ఓటు వినియోగించుకున్నారు. ఈ విడత ఎన్నికల్లో మొత్తం 1,314 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. తొలివిడత ఎన్నికలకు మొత్తం 45 వేల 341 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సదరన్ నేవల్ కమాండ్ లోని మొట్టమొదటి హైడ్రో గ్రాఫిక్ సర్వే వెసెల్ "ఐఎన్ఎస్ ఇక్షక్" భారత నావికా దళంలోకి ఈరోజు ప్రవేశించింది. దీని రాకతో భారత్ సముద్ర సర్వే వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతలో భాగంగా 80 శాతం స్వదేశీ సాంకేతికతతో గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ సంస్థ ఈ నౌకను నిర్మించింది. కొచ్చిలోని నేవల్ బేస్‌లో జరిగిన ఐఎన్ఎస్ ఇక్షక్ జల ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి ప్రసంగిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల జరిగిన ఐసిసి మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ - 2025 లో విశ్వ విజేతగా నిలిచిన భారత మహిళా జట్టు సభ్యులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఈరోజు కలిశారు. ఆ చిత్రాలను రాష్ట్రపతి సామాజిక మాధ్యమం ఎక్స్ లో పంచుకుంటూ.. భారత మహిళా జట్టు సభ్యులందరినీ అభినందించారు. ప్రపంచ కప్ గెలవడం ద్వారా చరిత్ర సృష్టించారని, ఈ విజయంతో విదేశాల్లోనూ లక్షలాది మంది భారతీయులు సంబరాలు చేసుకుంటున్నారన్నారని అన్నారు. మహిళా జట్టు సభ్యులు యువతకు ఆదర్శంగా నిలిచారని, ముఖ్యంగా బాలికలు జీవితంలో ముందడుగు వేసేలా స్ఫూర్తి పొందుతారని అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆత్మనిర్భరత ద్వారా వికసిత్ భారత్‌ను నిర్మించడానికి భారతదేశం ఆర్థిక, సామాజిక, సాంకేతిక రంగాల్లో స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ముంబైలో ఈరోజు జరిగిన 12వ SBI బ్యాంకింగ్ & ఎకనామిక్స్ కాన్ క్లేవ్‌లో ప్రసంగించిన నిర్మలా సీతారామన్.. GST సంస్కరణలు అమల్లోకి వచ్చిన మొదటి రోజు నుండే ప్రతి రంగం సానుకూల స్పందన నమోదు చేసిందన్నారు. భావితరం GST సంస్కరణలు తమ పట్ల ప్రతిస్పందించే ప్రభుత్వాలకు పౌరులు ప్రతిస్పందించడానికి సంసిద్ధతను ప్రదర్శించాయని నిర్మలా సీతారామన్ వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

సుస్థిర విమానయాన ఇంధనం (SAF) ఉత్పత్తిలో భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం బలమైన సాంకేతిక రూపకల్పనకు కృషి చేస్తోందని పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ ఇండియా సమ్మిట్‌లో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు. భారతదేశం ఫీడ్‌స్టాక్ లభ్యత, ఉత్పత్తి సౌకర్యాల కారణంగా SAF రంగంలో తోటి దేశాల కంటే ముందంజలో ఉందని అన్నారు. అంతర్జాతీయ వాయు రవాణా సంఘం డేటాను ఉటంకిస్తూ.. 2040 నాటికి విమానయాన పరిశ్రమకు 183 మిలియన్ టన్నుల SAF అవసరమవుతుందని మంత్రి పేర్కొన్నారు. భారతదేశం తన అంతర్జాతీయ అవసరాల కోసం 2030 నాటికి 5 శాతం ఇంధన మిశ్రమాన్ని సాధించాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ తన స్వదేశీ అవసరాలను తీర్చుకోవడమే కాకుండా, ప్రపంచ డిమాండ్లనూ తీర్చగలదని.. ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 8వ తేదీ నుండి 6 రోజుల పాటూ అంగోలా, బోట్స్వానా దేశాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటన వివరాలను విదేశాంగ మంత్రిత్వ శాఖ (తూర్పు ప్రాంత) కార్యదర్శి సుధాకర్ దలేలా పాత్రికేయులకు ఈరోజు వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా అంగోలా అధ్యక్షుడు జోవో మాన్యుయెల్ గొంకాల్వ్స్ లౌరెంకోతో రాష్ట్రపతి ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని ఆయన తెలియజేశారు. నవంబర్ 11న జరిగే అంగోలా 50వ స్వాతంత్ర్య వార్షికోత్సవ వేడుకలకు కూడా రాష్ట్రపతి హాజరవుతారని ఆయన చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య జరుగుతున్న 5 మ్యాచ్ ల టీ- 20 సిరీస్ లో భాగంగా ఈరోజు క్వీన్స్ ల్యాండ్ లోని కరార్ ఓవల్ స్టేడియం వేదికగా జరిగిన నాలుగో టీ-20 క్రికెట్ మ్యాచ్ లో భారత్ 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్, ఆస్ట్రేలియాకు 168 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన ఆస్ట్రేలియా 119 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ 3, అక్షర్ పటేల్, శివమ్ దూబే చెరో 2 వికెట్లతో రాణించారు. ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కించుకున్నాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా 4 కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించనున్నారు. ఈ రైళ్లు బనారస్-ఖజురహో, లఖ్‌నవూ-సహరన్‌పుర్, ఫిరోజ్‌పుర్-ఢిల్లీ, ఎర్నాకుళం-బెంగళూరు మార్గాల్లో నడవనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =